

బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు వీడ్కోలు పలుకుతున్న తెలంగాణ గవర్నర్ జిష్టు దేవ్‌వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర సీఎస్ శాంతికుమారి తదితరులు

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శనివారం 23 నవంబర్ 2024 | HYDERABAD






## వారానికి అరగంటే తాగునీరు

గౌతమ్‌నగర్ డివిజన్ ఇందిరా నెహ్రూనగర్ , జయగిరి లక్ష్మీనరసింహస్వామినగర్, రామాంజనేయనగర్ తదితర ప్రాంతాల్లో వారానికి అరగంటే మాత్రమే మంచినీరు సరఫరా అవుతున్నదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ చెప్పారు. ఈ మేరకు జలమండలి జీఎం వినోద్‌కుమార్‌ను కలిసి.. నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, మారేడ్‌పల్లి జీఎం వినోద్ కుమార్ , డీజీఎం విద్యాసాగర్ మంచినీటి ఎద్దడిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఈ సందర్భంగా కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ తెలిపారు. -నేరేడ్‌మెట్



## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి పాదయాత్ర

మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ తిరుమలనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాలనీ గుర్తుల సైన్ బోర్డులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం స్థానిక కార్పొరేటర్ జె. ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ జి. శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కాలనీలో పాదయాత్ర చేస్తూ.. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. -మల్లాపూర్, నవంబర్ 22

సీసీ కెమెరాలు లేకుంటే కేసుల దర్యాప్తు ముందుకు కదలడం లేదు. అంబర్‌పేటలో జరిగిన వృద్ధ దంపతుల హత్య కేసు మిస్టరీ వీడటం లేదు. నెల రోజులైనా కేసు దర్యాప్తులో పురోగతి లేదు. హైదరాబాద్‌లో ఇలాంటి డబుల్ మర్డర్ కేసుల దర్యాప్తులను తేల్చడంలో గతంలో ఎప్పుడు కూడా ఇంత ఆలస్యం జరుగలేదనే టాక్ నగర పోలీస్ విభాగంలో నడుస్తున్నది. కేవలం సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ ఆధారంగానే కేసుల దర్యాప్తునకు పోలీసులు అలవాటు పడటంతోనే ఈ తడబాటు జరుగుతున్నదనే చర్చ సైతం జరుగుతున్నది. అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో వృద్ధ దంపతులైన లింగారెడ్డి, ఊర్మిళ దేవిని గత నెల 19న గుర్తుతెలియని వ్యక్తులు అతి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే వృద్ధ దంపతుల హత్య జరిగి నెల రోజులైనా ఇప్పటివరకు పోలీసులు ఈ కేసును ఛేదించలేకపోయారు.

-సిటీబ్యూరో, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ)




# ఛేదిస్తారా..వదిలేస్తారా..?

## మిస్టరీగానే..వృద్ధ దంపతుల హత్య కేసు

- సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ లేకుంటే కేసుల ఛేదనలో తడబాటు
- సిటీ పోలీసుల దర్యాప్తు నైపుణ్యాలపై విస్తృత చర్చ
- ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినా..ఫలితం శూన్యం

### దోపిడీ..దొంగతనం కోణంలోనూ..

హత్య ఘటనపై పోలీసులు ముందుగా దోపిడీ, దొంగతనం కోణంలో దర్యాప్తు జరిపారు. ఇంట్లో ఎవరు ఉండరు, ఇద్దరే వృద్ధులు ఉండడంతో వారి వద్ద ఉన్న నగదు, ఆభరణాలు దోచేయాలనే ప్లాన్‌తో జరిగిందని అనుమానించారు. అయితే ఇంట్లో బీరువాల్లో దాచిన సొమ్ము పోలేదు. అయితే వృద్ధురాలి చేతికి బంగారు గాజులు, పుస్తెలతాడు లేదని పోలీసులు గుర్తించారు. దోపిడీ.. దొంగతనమే లక్ష్యంగా ఆగంతకులు వస్తే ఇంట్లో ఉన్నవాటిని కూడా దోచేయాలి.. అలా జరగకపోవడంతో పోలీసుల దృష్టి మళ్లించేందుకు ఇలా చేసి ఉంటారనే అనుమానంతో ఆ కోణాన్ని పోలీసులు పక్కన పెట్టారు. ఇతరులతో ఎవరెవరితోనైనా ఆర్థికపరమైన తగదాలు, ఇతరాత్ర ఆస్తుల తగాదాలున్నాయనే కోణంలోనూ ఆరా తీశారు. వృద్ధ దంపతులకు ముగ్గురు కూతుళ్లు ఉండగా, అందులో ఇద్దరు విదేశాల్లో నివసిస్తున్నారు. మరో కూతురు కొంపల్లిలో ఉంటున్నారు. ఘటన జరిగిన తరువాత కేసులో పురోగతి అంతగా కనిపించకపోవడంతో ప్రత్యేక బృందాలను ఉన్నతాధికారులు రంగంలోకి దింపారు. ఈ కేసు దర్యాప్తులో అంబర్‌పేట పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ బృందాలు పాల్గొంటున్నాయి.

### సీసీ కెమెరాలపైనే..

ఘటన జరిగిన ఇంటికి సీసీ కెమెరాలు లేకపోవడంతో పోలీసులకు నిందితులకు సంబంధించిన ఆధారాలు చిక్క లేదు. దీంతో కేసు దర్యాప్తు ప్రత్యేక బృందాలను నియమించిన ముందుకు సాగడం లేదు. నగర పోలీసులు మొదటి సారిగా ఇలాంటి కేసుల్లో వెనకబడిపోయారనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్ పోలీసుల గతంలోగా వేగంగా పని చేయడం లేదనే ఆరోపణలొస్తున్నాయి. వృద్ధ దంపతుల గురించి బాగా తెలిసిన వారే హత్య చేసి ఉండడం కాని, హత్య చేయించి ఉండడం కాని జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఆ దిశగా ఆధారాలను సేకరించలేకపోతున్నారు. ఆ ఇంటికి వచ్చిపోయే రూట్‌లోని సీసీ కెమెరాలను సైతం విశ్లేషించిన పోలీసులకు అనుకున్న మేర ఆధారాలు లభించలేదు. ప్రస్తుతం పోలీసులు పూర్తిగా సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్‌పైనే ఆధారపడడంతో ఇతర కోణాల్లో దర్యాప్తు చేయలేకపోతున్నారనే వాదన నడుస్తున్నది. సీసీ కెమెరాల్లో నిందితుడు ఎక్కడో ఓ చోట కనిపిస్తాడు. సెల్‌ఫోన్‌లో ఎప్పుడో ఓ సారి మాట్లాడి ఉంటాడు.. ఆ సెల్‌ఫోన్‌లో ఉన్న నంబర్లు, కాల్ హిస్టరీ ఆధారంగా కూడా దర్యాప్తు చేసినా.. అనుకున్న ఆధారాలు లభించలేదని తెలుస్తున్నది.

### త్వరలోనే కొలిక్కి...

అంబర్‌పేట పోలీసులు మాత్రం ఈ కేసును త్వరలోనే ఛేదిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. బంధువులు, కుటుంబసభ్యులకు మధ్య తగాదాలకు సంబంధించిన ఒక బిగ్ బ్రేకింగ్ తాము ఛేదించామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు నెల రోజుల నుంచి పోలీసులు త్వరలోనే కేసు ఛేదిస్తున్నామని చెబుతూ వస్తున్నారని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ కేసు మిస్టరీని పోలీసులు ఛేదిస్తారా..? అలాగే ఆధారాలు లేని కేసుగా వదిలేస్తారా వేచి చూడాలి.

# దర్జాగా కబ్జా..

## అక్రమ నిర్మాణాలు.. మైనింగ్ పనులు

- 325 ఎకరాల సర్కారు భూమి హాంఫట్
- బార్డర్ ఇష్యూ అంటూ.. తప్పుదోవ పట్టిస్తున్న రెవెన్యూ
- గ్రామస్తులు ఫిర్యాదులు చేసినా.. చర్యలు శూన్యం

మేడ్చల్/కీసర, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ అండదండలతో కొందరు అక్రమార్కులు దర్జాగా వందలాది ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించేసి..అందులో యధేచ్ఛగా అక్రమ వ్యాపారాన్ని సాగిస్తూ కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకొంటున్నా..సర్కారు పట్టించుకోవడం లేదు. మేడ్చల్ జిల్లా కీసర మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో సాల్వో ఇండస్ట్రీస్ లిమిటెడ్ పేరిట నగరానికి చెందిన జయరాంరెడ్డి అనే వ్యక్తి సాల్వో కంపెనీ నెలకొల్పాడు. ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి జిల్లాల ప్రభుత్వ భూమిలో సాల్వో పేరుతో అమోనియం నైట్రేట్ పదార్థాల నిల్వల పేరుతో సుమారు 350 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లు ఆరోపణలున్నాయి. అంకిరెడ్డిపల్లిలోని సర్వే నంబర్ 886లో 19 ఎకరాలు, సర్వే నంబర్ 887లో 10 ఎకరాలు సర్వే నంబర్ 918లో 295 ఎకరాలు మొత్తం 325.02 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ప్రహరీ నిర్మించి ప్రభుత్వ స్థలంలో మైనింగ్ మాఫియాను కొనసాగిస్తూ ఎక్స్‌ప్లోజివ్స్‌లను ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తూ కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకొంటున్నా.. ప్రభుత్వం మాకేందులే అన్న విధంగా వ్యవహరిస్తున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ఆన్‌లైన్‌లో రికార్డులున్నా..

అంకిరెడ్డిపల్లి గ్రామానికి సంబంధించి 918 సర్వే నంబర్‌లో 295 ఎకరాలు, 886లో 19.23 ఎకరాలు, 887లో 10 ఎకరాలు మొత్తం 325 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించి 1954 నుంచి 2024 వరకు సెత్వార్, కాస్రా, ఆన్‌లైన్ రికార్డుల్లో 325 ప్రభుత్వ భూమి అంకిరెడ్డిపల్లికి సంబంధించిందని స్పష్టంగా ఉంది. ఆ భూమిని 2012లో అప్పటి ప్రభుత్వ రెవెన్యూ అధికారులు మాన్యువల్ పహణీలో ఆ భూమి నల్గొండ జిల్లా రామలింగంపల్లి బొమ్మాలరామారం మండలానికి చెందిందని తప్పుడు రికార్డును నమోదు చేశారని అంకిరెడ్డిపల్లి గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. ఆ భూమిని రామలింగంపల్లిలోని సర్వే నంబర్ 312లో చిత్రీకరించి.. ఈ సర్వే నంబర్‌లో మొత్తం 590 ఎకరాల భూమి ఉన్నట్టు చూపించారన్నారు. అంకిరెడ్డిపల్లికి సంబంధించి 250 ఎకరాల పట్టా భూములు, 325 ఎకరాల ప్రభుత్వ భూములను రామలింగంపల్లి గ్రామంలో ఎక్కించారు.

### 1965లోనే.. జీవో విడుదల

1965లోనే అంకిరెడ్డిపల్లిలోని 325 ప్రభుత్వ భూమికి సంబంధించి ఎలాంటి సమస్యలు లేవంటూ.. ఆ భూమిని జీవో నం. 393, 24/03/1966 సంవత్సరంలోనే కీసర రెవెన్యూలో కలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను తప్పుదోవ పట్టించి రెవెన్యూ అధికార యంత్రాంగం హైకోర్టుకు చూపించడం లేదు. ఆ భూమికి సంబంధించి ఆర్‌డీడీ సర్వే జరిగిందని జిల్లా కలెక్టర్ దగ్గర నిర్ణయం పెండింగ్ ఉందని కీసర మండల రెవెన్యూ అధికారులు తప్పుడు సమాచారాన్ని ఇస్తూ బడా బాబులకు దాసోహమవుతున్నారు. ఇదంతా పెండింగ్ ఉన్నప్పుడు ఆ ల్యాండ్‌కు సంబంధించి మ్యాప్ బయటికి ఏ విధంగా వస్తుందని అంకిరెడ్డిపల్లి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆ స్థలంలో ఎవరూ పనిచేయవద్దని కోర్టు ఆదేశాలు జారీ చేసినా జయరాంరెడ్డి కంపెనీ నిర్వాహకులు యధేచ్ఛగా అక్రమ నిర్మాణాలు, మైనింగ్ పనులు కొనసాగిస్తున్నారు.

### ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేశాం.. అంకిరెడ్డిపల్లి గ్రామస్తులు

అంకిరెడ్డిపల్లిలో కబ్జాకు గురవుతున్న సుమారు 325 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించి ఇప్పటికీ అనేక సార్లు ప్రజాదర్బార్, ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేశామని స్థానికులు పేర్కొంటున్నారు. సాల్వో కంపెనీ చైర్మన్ జయరాంరెడ్డి అంకిరెడ్డిపల్లిలోని ప్రభుత్వ భూమితో పాటు తమ గ్రామంలో ఉన్న 60 నుంచి 70 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి ఒక్కరిద్దరి దగ్గర నోటరీ చేయించుకొని మిగతా లబ్ధిదారులకు సంబంధించిన భూమిని కూడా కబ్జా చేసి అందులోకి ఎవరిని రానివ్వడం లేదని స్థానికులు అనేకసార్లు కంపెనీ ముందు కూడా అందోళన వ్యక్తం చేశారు.

### మరిన్ని అక్రమాలు..

ప్రభుత్వ నేతలు, అధికారుల అండదండలతో సాల్వో ఇండస్ట్రీస్ వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నారు. కీసర మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో ఏకంగా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఆ ప్రభుత్వ భూమిలో సాల్వో కంపెనీ పేరుతో బ్లాస్టింగ్ పదార్థాలను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తూ కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. రెండు జిల్లాల ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేసి ప్రభుత్వం వద్ద ఉన్న పెద్దలను ఎప్పటికప్పుడు మేనేజ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములే కాదు అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పేదలకు అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములను సైతం సుమారు 20 నుంచి 30 మంది దగ్గర 60 ఎకరాల వరకు అసైన్డ్ దారుల నుంచి అక్రమంగా కొనుగోలు చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. రిజిస్ట్రేషన్ కాని భూములను దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నోటరీలతో భూములను కాజేసి యధేచ్ఛగా ఆ భూముల్లో తన వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. చాలా ఏండ్లుగా స్థానికంగా ఉన్న ప్రజలు తమ భూములను కబ్జా చేశారని.. వారు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ, అసైన్డ్ భూములను కబ్జా చేసి ఆ స్థలంలో గోడను నిర్మించి తమ వ్యాపారాన్ని గుట్టు చప్పుడు కాకుండా కొనసాగిస్తున్నారు. సర్వే నంబర్లు 918లో 295 ఎకరాలు, 886లో 19 ఎకరాలు, 887లో 10 ఎకరాలు మొత్తం 325.02 ఎకరాలు ప్రభుత్వ భూమి కీసర మండలంలోకి వస్తున్నట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉంది.

## ఇది బార్డర్ ఇష్యూ..

- కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్



రామలింగంపల్లి, అంకిరెడ్డిపల్లి గ్రామాల మధ్య బార్డర్ ఇష్యూ ఉంది. ఆర్‌డీడీ ద్వారా సర్వే చేశాం. ఉన్నతాధికారుల దగ్గర ఈ ఇష్యూ పెండింగ్‌లో ఉంది. రెండు మూడు నెలల్లో నిర్ణయం వెలువడుతుంది. మాకు వచ్చే ల్యాండ్‌ను మేము తీసుకొంటాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తాం. ప్రైవేటు సెక్యూరిటీతో ఇక్కడ సాల్వో కంపెనీలో తయారు చేసే ఎక్స్‌ప్లోజివ్‌లను సెంట్రల్ గవర్నమెంట్‌కు సరఫరా చేస్తారు. 325 ప్రభుత్వ భూమి అని నిర్ధారణ కాలేదు. ఈ రెండు బార్డర్లపై స్టేటస్‌కో ఉంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే అక్కడ ప్రభుత్వ బోర్డులు పెట్టేలా నిర్ణయం తీసుకుంటాం. అక్కడ ఉన్న రెండు చెరువులు కబ్జాకు గురైనట్లు ఆరోపణలున్నాయి ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చాం.



ప్రజాభవన్‌లో అధికారులకు ఫిర్యాదు చేస్తున్న అంకిరెడ్డిపల్లి గ్రామస్తులు

# కోత లేకుండా వాల్వ్ రిప్లేస్‌మెంట్

- క్లిష్టమైన శస్త్రచికిత్సతో రోగి ప్రాణాలను కాపాడిన నిమ్స్ వైద్యులు



రోగితో వైద్యులు శ్రీనివాస్ తదితరులు

ఖైరతాబాద్, నవంబర్ 22 : నిమ్స్ మరో మైలురాయిని అధిగమించింది. దవాఖాన చరిత్రలోనే మొదటిసారిగా అనేక దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగికి విజయవంతంగా కోత లేకుండా వాల్వ్ రిప్లేస్‌మెంట్ చేసి వైద్యులు రికార్డు సృష్టించారు. నగరానికి చెందిన 56 ఏండ్ల రోగి కొంత కాలంగా రక్తపోటు, మధుమేహం, దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ నిమ్స్‌లో చేరాడు. అప్పటికే హీమో డయాలసిస్ చేసుకుంటున్న ఆ రోగికి కొత్త సమస్య వచ్చింది. వైద్య పరిభాషలో మైట్రాల్ వాల్వ్ స్టీనియోసిస్‌గా పిలిచే ఈ వ్యాధికి చికిత్స అందించాలంటే అప్పటికే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సదరు రోగికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేస్తే అత్యంత ప్రమాదకరమని వైద్యులు గుర్తించారు. వివిధ పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ఎలాంటి కోత లేకుండానే ఆధునిక విధానంలో చికిత్స అందించాలని నిర్ణయించారు. కార్డియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ బి. శ్రీనివాస్, వైద్యులు డాక్టర్ మణికృష్ణ, డాక్టర్ అభినయ్‌రెడ్డి, డాక్టర్ కె. అనురాగ్ బృందం కాంప్లెక్స్ ట్రాన్స్‌క్యాథటర్ మైట్రా వాల్వ్ రీప్లేస్‌మెంట్ విధానంలో చికిత్స చేసి సమస్యను తీర్చింది. రోగి రెండు రోజుల్లోనే సాధారణ స్థితి వస్తారని, వైద్యుల సూచనలు పాటిస్తే సరిపోతుందని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

# బియ్యం పిండితో యాంటీబయోటిక్స్

## రూ. 6.91 లక్షల విలువైన సరుకు స్వాధీనం..ఇద్దరు నిందితుల అరెస్టు

సిటీబ్యూరో, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ):ప్రజల ప్రాణాలకు హానికలిగించే నకిలీ మందులపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కొరడా ఝుళిపిస్తున్నది. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా నకిలీ ఔషధాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన డీసీఏ అధికారులు.. శుక్రవారం నకిలీ యాంటీబయోటిక్, నార్కోటిక్ మందులను పట్టుకుని సీజ్ చేశారు. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ వీబీ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం... యూపీకి చెందిన మహేశ్ కుమార్ షైనీ తన కంపెనీలో నిబంధనలకు విరుద్ధంగా సుద్ద, బియ్యం పిండితో నకిలీ యాంటీబయోటిక్ మందులను తయారు చేసి దేశవ్యాప్తంగా సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో ఏపీలోని ప్రొద్దుటూరుకు చెందిన గండ్ల రాములు, మునిశేఖర్ మహేశ్‌కుమార్ వద్ద నుంచి నకిలీ యాంటీబయోటిక్ మందులతో పాటు సర్జరీల్లో వినియోగించే ఫెంటనైల్ ట్రాన్స్‌డెర్మల్ ప్యాచెస్‌ను కొనుగోలు చేసి తెలంగాణలోని కరీంనగర్, ఏపీలోని కర్నూలుకు సరఫరా చేస్తున్నారు.

### కొరియర్ ద్వారా దిగుమతి

నకిలీ యాంటీబయోటిక్ మందులు, నార్కోటిక్ డ్రగ్స్‌ను నిందితులు యూపీ నుంచి నగరానికి కొరియర్ ద్వారా తెప్పించుకుని ఆ తరువాత వాటిని తెలంగాణలోని కరీంనగర్, ఏపీలోని కర్నూలు ప్రాంతాల్లోని మెడికల్ షాపులకు సరఫరా చేస్తున్నారు. దీనిపై విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు శుక్రవారం బాలానగర్‌లోని తిరుపతి కొరియర్ సంస్థపై ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్, డీసీఏ అధికారులు కలిసి సంయుక్తంగా దాడులు జరిపారు. ఈ దాడుల్లో రూ.6.91 లక్షల విలువ చేసే నకిలీ యాంటీబయోటిక్ మందులతో పాటు నార్కోటిక్ డ్రగ్స్‌ను సీజ్, నిందితులు గండ్ర రాములు, మునిశేఖర్‌ను అరెస్టు చేశారు. అయితే గండ్ర రాములు గతంలో కూడా నకిలీ ఔషధాలను సరఫరా చేసిన పాత నేరస్తుడని, అతడిపై మూడు కేసులు నమోదై ఉన్నట్లు డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో చాకచక్యంగా వ్యవహరించి నకిలీ యాంటీబయోటిక్ ఔషధాలు, నార్కోటిక్ డ్రగ్స్ పట్టుకున్న డీసీఏ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, సరూర్‌నగర్, ఉప్పల్, సికింద్రాబాద్, మలక్‌పేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, లక్ష్మణ్, గోవింద్‌సింగ్, అనిల్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సీఐ నాగరాజు, ఇతర సిబ్బందిని డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

